వ్యాపార రంగంలో మహిళలు రాణించాలి

మహిళా క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

మామిళ్లగూడెం, నవంబర్ 11: మహిళలు వ్యాపార రంగంలో రాణించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. నాణ్యత, నమ్మకమే బ్రాండ్‌గా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కలెక్టరేట్‌లోని ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్‌ను సోమవారం ఆయన సందర్శించారు. నలుగురు మహిళలు కలిసి నిర్వహిస్తున్న ఈ క్యాంటీన్‌కు వెళ్లి నిర్వాహకులతో మాట్లాడారు. వ్యాపారం సాగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. నాణ్యతలో రాజీపడొద్దని, శుభ్రతను పాటించాలని సూచించారు. ఈ వ్యాపారంలో ఆర్థిక స్థిరత్వం సాధించాంచాలని ఆకాంక్షించారు. డీఆర్‌డీవో సన్యాసయ్య, డీఆర్‌వో రాజేశ్వరి, అదనపు డీఆర్‌డీవో నూరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అధికారులందరూ కలిసి అక్కడ టీ తాగారు.

'ప్రజావాణి దరఖాస్తులకు ప్రత్యేక కౌంటర్'

ఖమ్మం, నవంబర్ 11: నగర పాలక సంస్థలో ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి, దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్, కేఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ శ్రీజ ఆదేశించారు. గ్రీవెన్స్‌డే సందర్భంగా కేఎంసీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో నగర ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వరద బాధితుల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని, వారి సందేహాలను నివృత్తి చేయాలని, ఒక్కసారి వచ్చిన వారు మరోసారి రాకుండా వారి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. సిబ్బంది, ఉద్యోగులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కేఎంసీ అధికారులు పాల్గొన్నారు.

అండర్-14 వాలీబాల్ జట్ల ఎంపిక

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా అండర్-14 వాలీబాల్ జట్టు

ఖమ్మం సిటీ, నవంబర్ 11: జిల్లాస్థాయి పాఠశాల క్రీడల అండర్-14 వాలీబాల్ బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. ఖమ్మం పటేల్ స్టేడియంలో సోమవారం నిర్వహించిన ఈ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. మెరుగైన ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా జట్లకు ఎంపిక చేశారు. వీరిని ఈ నెల 16 నుంచి 18 వరకు మెదక్ జిల్లా చేగుంటలో జరుగనున్న రాష్ట్రస్థాయి అండర్-14 పోటీలకు పంపించనున్నారు. ఎంపికలను వాలీబాల్ చీఫ్ కోచ్ అక్బర్ అలీ, బాలరాజు, నాగరాజు, గోపి, సైదేశ్వరరావు, సఫిక్ అహ్మద్, రాజకుమారి పర్యవేక్షించారు. అనంతరం ఎంపిక జాబితాను జిల్లా పాఠశాల క్రీడల కార్యదర్శి కే.నరసింహామూర్తి వెల్లడించారు.

అండర్-14 బాలికల జట్టు..

హెచ్.భార్గవి, బీ.గౌతమి, బీ సౌజన్య, పీ.మేఘహర్ష, ఎస్.అర్షియా, టీ.జిన్యాశ్రీ, జే.అక్షియ, ఏ.జ్యోతిక, ఈ.గాయత్రి, ఈ.దీక్షిత, సీహెచ్.కోమలి, బీ.అనూష, ఆకృతి.

అండర్-14 బాలుర జట్టు..

వై.నవదీప్, ఏ.నాగవైతన్య, వై.రిషివర్మ, బీ.నవీన్‌రెడ్డి, ఈ.సన్ని, ఎం.సాయి అక్షయకుమార్, కే.రాజు, టీ.రామ్‌చరణ్, బీ.గణేశ్, డీ.లోకేశ్, ఎం.కరుణాకర్, ఎస్‌డీ.అర్షద్.

వైరా రెవెన్యూ అధికారుల నిరసన

వైరాటౌన్, నవంబర్ 11: వికారాబాద్‌లో కలెక్టర్‌తోపాటు జిల్లా అధికారులపై జరిగిన దాడిని ఖండిస్తూ వైరా రెవెన్యూ శాఖ అధికారులు సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి సోమవారం నిరసన వ్యక్తం చేశారు. దాడి చేసిన వారిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌బాబు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వరరావు, శ్రీకాంత్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది నిరసన వ్యక్తం చేసిన వారిలో ఉన్నారు.

సర్వే సమస్తం..అస్తవ్యస్తం..

- ఖమ్మం నగరంలో సర్వే ప్రక్రియ మొత్తం గందరగోళం
- నగర పాలక సంస్థలో నత్తనడకలా సాగుతున్న స్టిక్కరింగ్
- డివిజన్లలో పూర్తిస్థాయిలో ప్రారంభంకాని 'సమగ్ర సర్వే'
- ముందస్తు సమాచారంలేక నగర వాసుల ఎదురుచూపులు
- ఎన్యూమరేటర్లు ఎప్పుడొస్తారోనంటూ పడిగాపులు
- సర్వేలో బీఆర్ఎస్ కార్పొరేటర్లకు భాగస్వామ్యం కరువు
- నామమాత్రపు శిక్షణతో సిబ్బంది.. క్షేత్రస్థాయిలో ఇబ్బంది..
- కొన్నిచోట్ల ఎన్యూమరేటర్ల విధుల్లో వారి కుటుంబ సభ్యులు

స్టిక్కర్ అంటిస్తున్న సిబ్బంది



ఖమ్మం, నవంబర్ 11: రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) ఖమ్మం నగరంలో అస్తవ్యస్తంగా కొనసాగుతోంది. ప్రభుత్వ ప్రణాళికలోపం సర్వేలో స్పష్టంగా కన్పిస్తోంది. ఈ సర్వే ప్రక్రియలో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి చెప్పినప్పటికీ క్షేత్రస్థాయిలో అలాంటి ఆనవాళ్లు లేవు. గ్రామాలు, మండల స్థాయిలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీల పదవీకాలాలు ముగిసి వారు పదవుల్లో లేనందున ఈ సర్వేలో వారి భాగస్వామ్యం లేదు. కానీ ఖమ్మం నగర పాలకసంస్థలో కార్పొరేటర్లు ఉన్నప్పటికీ అధికారులు కేవలం అధికార పార్టీ కార్పొరేటర్లకు మాత్రమే సమాచారం అందిస్తున్నారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లకు సమాచారం ఇవ్వకుండానే సర్వే ప్రక్రియను చేపడుతున్నారు.

ఇళ్ల లిస్టింగ్‌లో గందరగోళం..

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ (కేఎంసీ)లో 60 డివిజన్లు ఉన్నాయి. గత లెక్కల ప్రకారం కేఎంసీలో 1,68,875 గృహాలు ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. వీటిని 965 ఎన్యూమరేషన్ బ్లాక్‌లుగా ఏర్పాటు చేసి 965 మందిని ఎన్యూమరేటర్లుగా నియమించారు. వీరిలో ప్రాథమిక పాఠశాలల టీచర్లు 307 మంది, అంగన్‌వాడీ టీచర్లు 207 మంది, మెప్మా ఆర్‌పీలు 157 మంది, మెప్మాలో ఎస్‌హెచ్‌జీ బాధ్యులు 210 మంది, ఆశా కార్యకర్తలు 84 మంది ఉన్నారు. వీరిలో ఒక్కొక్కరికీ 150 నుంచి 175 వరకు గృహాలను కేటాయించారు. అయితే, ఈ నెల 6న ప్రారంభమై 9న పూర్తికావాల్సిన స్టిక్కరింగ్ ప్రక్రియ.. 11వ తేదీ దాటినా పూర్తికాలేదు. ఆదివారం నాటికి 1,53,085 గృహాలకు మాత్రమే స్టిక్కరింగ్ వేసినట్లు అధికారులు వెల్లడించారు. అయితే ఇది మరో రెండు రోజుల వరకు కొనసాగే అవకాశమున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. కాగా, అపార్ట్‌మెంట్ల వద్ద మొత్తం ఎన్ని కుటుంబాలు ఉంటున్నాయో లెక్కించకుండానే అపార్ట్‌మెంట్ల కింద స్టిక్కర్లు అంటింటి వెళ్తున్నారు. కనీసం ఇక్కడ ఎన్ని కుటుంబాలు ఉన్నాయో లెక్కించకుండా సర్వే ఎలా చేస్తారో తెలియడం లేదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అయితే, అద్దెకు ఉంటున్న వారి సర్వే కూడా వారు కోరుకుంటే ఇక్కడే చేయాల్సి ఉంది. కానీ సర్వేకు వచ్చే వారు మాత్రం.. 'మీ సొంత ఊళ్లకు వెళ్లి సర్వే చేయించుకోండి' అంటూ చెబుతున్నారు. దీంతో నగరంలో అద్దె ఇళ్లలో ఉంటున్న వారు గందరగోళానికి గురవుతున్నారు.

సర్వే సిబ్బందికి నామమాత్రపు శిక్షణ

సర్వే సిబ్బందికి అధికారులు సమగ్ర శిక్షణ ఇవ్వకపోవడంతో క్షేత్రస్థాయిలో వారు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సర్వే దరఖాస్తులో అన్ని విషయాలనూ అంకెల్లోనే నింపాలి. అయితే ప్రజలు సర్వే సిబ్బందికి వివరాలు చెబుతుంటే వారు అంకెలు వేయడాన్ని చూసి ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తాము చెబుతున్న వివరాలనే నమోదు చేస్తున్నారో లేదో అనే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలు వస్తాయా? రావా? అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల ప్రజలు సర్వేకు సహకరించడం లేదు.

నత్తనడకన సర్వే..

ఖమ్మం నగరంలో సమగ్ర సర్వే నత్తనడకన కొనసాగుతోంది. ఈ నెల 9 నుంచే పూర్తిస్థాయిలో మొదలు కావాల్సి ఉన్నప్పటికీ కేవలం కొన్ని చోట్లనే ప్రారంభించారు. మరికొన్ని డివిజన్లలో సోమవారం నాటికి కూడా సర్వే ప్రారంభ కాలేదు. 75 అంశాలను పూరించాల్సి ఉండడంతో ఎన్యూమరేటర్లకు ఒక్కో ఇంటి వద్ద దాదాపు గంటకు పైగానే సమయం పడుతోంది. రోజు మొత్తం శ్రమించినా ఒక్కొక్కరూ ఐదు కుటుంబాలను కూడా సర్వే చేయలేకపోతున్నారు. దీంతో నిర్దేశిత గడువైన ఈ నెల 30లోపు సర్వే పూర్తయ్యే అవకాశం లేదు. ప్రభుత్వ ఉపాధ్యాయులు మధ్యాహ్నం నుంచి సర్వేలో పాల్గొనాల్సి ఉన్నప్పటికీ కొన్ని చోట్ల వారి కుటుంబ సభ్యులు సర్వే చేస్తుండడం గమనార్హం. అపార్ట్‌మెంట్లను ఎక్కాల్సిన చోట ఎక్కువ వయసున్న ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు.

సమాచారం లేక ఎదురుచూపులు

ఎన్యూమరేటర్లు ఏ డివిజన్‌లో ప్రాంతం నుంచి సర్వే ప్రారంభించారో ఎవరికీ తెలియడం లేదు. తమ ఇంటి వద్దకు ఎప్పుడొస్తారోనన్న సమాచారం లేక చాలామంది ఆందోళన చెందుతున్నారు. ఉద్యోగాలు, ఇతరత్రా పనుల కోసం బయటకు వెళ్లే వారు, ఇప్పటికే పలు కారణాలతో వేర్వే ఊళ్లలో ఉన్న వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ ప్రాంతంలో ఏ రోజు సర్వే చేస్తారో ముందస్తు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు. కాగా, సమగ్ర సర్వే నిర్వహణపై సదరు ఎన్యూమరేటర్లకు ఖమ్మం డీపీఆర్‌సీ భవనంలో సోమవారం ఒక్క రోజు శిక్షణ అందించారు.

నూతన వధూవరులకు 'నామా' ఆశీర్వాదం

నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎంపీ నామా

ఖమ్మం, నవంబర్ 11: ఖమ్మం గుట్టలబజార్‌కు చెందిన రావూరి శ్రీనివాస రావు - అరుణ దంపతుల కుమారుడు నిఖిల్ వివాహం ఖమ్మం జూబ్లీపుర స్వర్ణభారతి కల్యాణ మండపంలో జరుగగా ఈ వేడుకకు ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వర రావు తన కుటుంబ సభ్యులతో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. బీఆర్ఎస్ నాయకులు బాణాల వెంకటేశ్వర్లు, మోరంపూడి ప్రసాద్‌రావు, వాకదాని కోటేశ్వరరావు, నామా సేవ సమితి బాధ్యులు పాల్వంచ రాజేశ్, తాళ్లూరి హరీశ్, రేగళ్ల కృష్ణప్రసాద్, సింగవరపు నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌పై దాడి పట్ల రెవెన్యూ అధికారుల నిరసన

నిరసన తెలుపుతున్న తహసీల్దార్, సిబ్బంది

ఎర్రుపాలెం, నవంబర్11: కొడంగల్‌లో కలెక్టర్ ప్రతీక్‌జైన్‌పై దాడి చేయడాన్ని నిరసిస్తూ తహసీల్దార్ ఎం ఉషా శారద ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట రెవెన్యూ అధికారులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం ఉషాశారద, ఆర్ఐలు రవి, రాజశేఖర్, యూడీసీ అభిరామ్, సిబ్బంది బాబా, వరలక్ష్మి, వెంకటేశ్వరరావు, జానీ, నరేష్, షఫీ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు మోడల్ విద్యార్థులు

ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్,అధ్యాపకులు

కారేపల్లి, నవంబర్ 11: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఇలియాట్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. స్థానిక పాఠశాలలో సోమవారం ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో కలిసి అధ్యాపక బృందం అభినందించారు. వెయిట్ లిఫ్టింగ్‌లో నిక్షిత, పల్లవి, నవ్యశ్రీ, నాగశ్రీ, సాత్విక, దివ్య, బి.ప్రేమ్‌కుమార్, ఎం.రాకేష్, కె.ప్రేమ్‌కుమార్, నూతన్‌కుమార్, ఉదయ్‌కుమార్, శ్యాం, పుట్‌బాల్‌కు పల్లవి, యశస్విని, అమూల్యప్రియ, సాత్విక, వాలీబాల్‌కు పల్లవి ఎంపికైనట్లు వెల్లడించారు.

బాధ్యతలు స్వీకరించిన పోలీస్ అధికారులు

సీపీని మర్యాద పూర్వకంగా కలిసిన ఏఆర్ ఏడీసీపీ కుమారస్వామి, సీసీఆర్‌బీ ఏసీపీ రవీందర్‌రెడ్డి

మామిళ్లగూడెం, నవంబర్ 11: ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏఆర్ అడిషనల్ డీసీపీగా సీహెచ్ కుమారస్వామి, సీసీఆర్‌బీ ఏసీపీగా పీ.రవిందర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ సునీల్‌దత్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు.

యోగా పోటీల్లో కేంద్రీయ విద్యాలయం విద్యార్థుల ప్రతిభ

యోగా పోటీల్లో ప్రతిభ కనబరిచిన కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు

ఖమ్మం సిటీ, నవంబర్ 11: ఈ నెల 9,10 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో ఖమ్మం కేంద్రీయ విద్యాలయానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సిద్ధార్థ యోగ విద్యాలయానికి చెందిన యోగా మాస్టర్ కోదండరావు ఆధ్వర్యంలో శిక్షణ పొందిన వారు.. సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో పోటీ పడ్డారు. కాగా, జూనియర్ విభాగంలో బాసాని నవదీప్ (10వ తరగతి) స్వర్ణ పతకం, పూసల యశ్వంత్ (9వ తరగతి) కాంస్య పతకం సాధించారు. దీంతో పాటు ఝార్ఖండ్ రాష్ట్రంలో జరుగనున్న జాతీయస్థాయి యోగా పోటీలకు కూడా అర్హత పొందారు. అదేవిధంగా సబ్ జూనియర్ విభాగంలో దోమల లక్ష్మీ ప్రణీత్ (8వ తరగతి) రాష్ట్రస్థాయిలో ఆరో స్థానంలో నిలిచారు. వీరిని ఖమ్మం కేంద్రీయ విద్యాలయం ప్రధాన అధ్యాపకుడు, టీచర్లు ప్రత్యేకంగా అభినందించారు.

విదర్భలో విజేతదే మహా పీఠం

- ఇక్కడ 62 అసెంబ్లీ నియోజకవర్గాలు
- ఈ ప్రాంతంలో పట్టు సాధిస్తే అధికారం పక్కా
- ప్రత్యేక దృష్టి సారించిన రెండు కూటములు

ముంబై, నవంబర్ 11(నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర ఎన్నికలు సమీపిస్తున్న వేళ రెండు కూటములు విదర్భ ప్రాంతంపై ప్రత్యేకంగా దృష్టి సారించాయి. 62 నియోజకవర్గాలు ఉన్న విదర్భలో పాగా వేస్తే అధికారానికి దగ్గరైనట్టే అని కూటములు లెక్కలు వేసుకుంటున్నాయి. ఇక్కడి ప్రజలను ఆకర్షించి మెజార్టీ సీట్లు తమ ఖాతాలో వేసుకోవాలని తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఇప్పటికే రెండు కూటముల నుంచి అగ్రనేతలు విదర్భ మొత్తాన్ని చుడుతూ ప్రచారం చేస్తున్నారు. ఎక్కువగా పత్తి పండించే రైతులు ఉన్న ఈ ప్రాంతంలో రైతులు ఎటువైపు నిలుస్తారనేది గెలుపోటములను నిర్ణయించనుంది.

రెండు కూటములకూ కీలకం

విదర్భలోని మొత్తం 62 స్థానాల్లో బీజేపీ, కాంగ్రెస్ 36 స్థానాల్లో ప్రత్యక్షంగా తలపడుతున్నాయి. 11 జిల్లాలు కలిగిన విదర్భ ప్రాంతం 1990ల వరకు కాంగ్రెస్‌కు కంచుకోట. మూడు దశాబ్దాలుగా ఇక్కడ బీజేపీ - శివసేన కూటమి పట్టు పెంచుకుంది. 2014లో ఇక్కడ బీజేపీ ఒంటరిగా పోటీ చేసి 44 స్థానాలను గెలుచుకుంది. 2019లో 29 స్థానాలకు పడిపోయింది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం మహా వికాస్ అఘూడీ(ఎంవీఏ) ఇక్కడ మంచి ఫలితాలను సాధించింది. విదర్భలోని 10 లోక్‌సభ స్థానాల్లో ఏడు స్థానాలను కైవసం చేసుకుంది. దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో విదర్భలో పాగా వేసేందుకు ఎంవీఏ ప్రయత్నిస్తున్నది. ఆరెస్సెస్ కేంద్ర కార్యాలయం విదర్భలోనే నెలకొని ఉండటం, రాష్ట్ర బీజేపీకి జోడుగుర్రాల్లాంటి దేవేంద్ర ఫడ్నవీస్, చంద్రశేఖర్ బవాంకులే ఈ ప్రాంతానికి చెందిన వారే కావడంతో బీజేపీ ఈసారి విదర్భ ప్రాంతాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నది.

మేఘాల్లోనూ మైక్రోప్లాస్టిక్

- పర్యావరణాన్ని ప్రభావితం చేస్తుండొచ్చు
- శాస్త్రవేత్తల ఆందోళన

న్యూఢిల్లీ: భూమిని మొత్తం ఆక్రమించేసిన మైక్రోప్లాస్టిక్స్ మేఘాల్లోకీ చేరాయని, ఇవి పర్యావరణాన్ని సైతం ప్రభావితం చేస్తుండొచ్చని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సంబంధించి అమెరికాలోని పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు చేసిన ఓ అధ్యయనంలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆకాశంలో మైక్రోప్లాస్టిక్‌లు మంచు కేంద్రక రేణువులుగా పని చేసి అసహజంగా మేఘాల ఏర్పాటుకు కారణమవుతున్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. సాధారణంగా మేఘాలు ఏర్పడే పరిస్థితులు లేకపోయినా మైక్రోప్లాస్టిక్‌లు మేఘాలు ఏర్పడేలా చేస్తాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని నిర్ధారించడం కోసం పరిశోధకులు నాలుగు రకాల మైక్రోప్లాస్టిక్‌లను ప్రయోగశాలలో పరీక్షించారు. ఇందుకోసం నీటి బిందువులను చల్లబరిచి మంచుగా మార్చారు. మైక్రోప్లాస్టిక్ లేని నీటి బిందువులు మైనస్ 38 డిగ్రీల సెల్సియస్ వద్ద గడ్డ కట్టగా, 50 శాతం మైక్రో ప్లాస్టిక్‌లతో కలుషితమైన నీటి బిందువులు మైనస్ 22 డిగ్రీల సెల్సియస్ వద్దనే గడ్డ కడుతున్నట్టు తెలుసుకున్నారు. కాబట్టి మైక్రో ప్లాస్టిక్‌లు మేఘాల నిర్మాణాన్ని ప్రభావితం చేస్తున్నాయని అర్థమవుతున్నదని శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఫ్రీడ్‌మన్ తెలిపారు.

ఇజ్రాయెల్‌పై హెజ్బొల్లా రాకెట్ల వర్షం

90కి పైగా క్షిపణుల ప్రయోగం • పలువురికి గాయాలు • ధ్వంసమైన వాహనాలు

హెజ్బొల్లా రాకెట్ దాడులతో ఇజ్రాయెల్‌లోని హైఫాలో దహనమవుతున్న కార్లు

బీరుట్, నవంబర్ 11: ఇజ్రాయెల్-హెజ్బొల్లా మధ్య పోరు మరింత తీవ్రరూపం దాల్చింది. లెబనాన్‌లోని హెజ్బొల్లా గ్రూప్ సోమవారం ఇజ్రాయెల్‌పై వరుస రాకెట్ దాడులతో విరుచుకుపడింది. ఇజ్రాయెల్ నగరం 'హైఫా' లక్ష్యంగా 90కిపైగా క్షిపణులను ప్రయోగించింది. ఈ దాడుల్లో హైఫాలో పలు భవనాలు దెబ్బతిన్నాయని, పలువురు గాయపడ్డారని, వాహనాలు ధ్వంసమయ్యాయని మీడియా కథనాలు పేర్కొన్నాయి. హెజ్బొల్లా ప్రయోగించిన పలు మిస్సైల్స్‌ను ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థ 'ఐరన్ డోమ్' అడ్డుకున్నప్పటికీ, మరికొన్ని హైఫాలో పలు జనావాస ప్రాంతాల్ని తాకాయని తెలిసింది. ఒక చిన్నారి సహా నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారని ప్రాథమిక సమాచారం. హెజ్బొల్లా రాకెట్ దాడుల్ని ఇజ్రాయెల్ భద్రతా బలగాలు (ఐడీఎఫ్) ధ్రువీకరించాయి. హైఫా పట్టణం శివారు ప్రాంతాల్ని మిస్సైల్స్ తాకాయని ఐడీఎఫ్ పేర్కొన్నది.

శ్మశానం కింద హెజ్బొల్లా సొరంగం!

హెజ్బొల్లా సభ్యులు ఉపయోగించే సొరంగాలను ధ్వంసం చేసినట్టు ఇజ్రాయెల్ సైన్యం(ఐడీఎఫ్) ఆదివారం తెలిపింది. వీటిలో ఒకటి శ్మశానం కింద ఉందని ఆరోపించింది. కిలోమీటర్ పొడవున ఉండే ఈ సొరంగాలను గుర్తించామని ఎక్స్‌లో ఒక వీడియోను పోస్ట్ చేసింది. ఈ సొరంగాల్లో కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్స్, నిద్రించే గదులు, ఆయుధగారాలు ఉన్నట్టు ఐడీఎఫ్ వెల్లడించింది. ఓ సొరంగంలో డజన్ల కొద్దీ ఆయుధాలు, ఇతర సైనిక సామగ్రి ఉన్న వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేసింది. 'ఉగ్రవాదుల అండర్ గ్రౌండ్ సొరంగాలను మా దళాలు ధ్వంసం చేశాయి. అందులో వ్యూహాత్మకంగా శ్మశానం కింద కూడా ఒకటి ఉంది. హెజ్బొల్లా మనుషులు చనిపోయినా, బతికున్నా వారికి విలువ ఇవ్వదు' అని ఐడీఎఫ్ విమర్శించింది.

ఇరాన్ రసాయన ఆయుధాల అభివృద్ధి!

ఇజ్రాయెల్ సైనికులు, పౌరులపై ప్రయోగించేందుకు ఇరాన్ రసాయన ఆయుధాల్ని సిద్ధం చేసిందన్న వార్తలు వెలువడ్డాయి. ఔషధ తయారీలో రసాయన ఏజెంట్స్‌గా వాడే సింథటిక్ ఓపియాయిడ్లు, ఫెంటానేల్.. వంటి వాటితో ఇరాన్ రసాయన ఆయుధాల్ని అభివృద్ధి చేసిందని అమెరికా రక్షణ రంగ నిపుణుడు మాథ్యూ లెవిట్ వెల్లడించారు. శక్తివంతమైన రసాయన ఏజెంట్స్‌తో గ్రనెడ్లు, బాంబులను ఇరాన్ తయారుచేసిందని, వీటి ప్రభావానికి లోనైతే.. బాధితుల నాడీ వ్యవస్థ కొన్ని క్షణాల్లో దెబ్బతింటుందని తెలిపారు. ఇజ్రాయెల్ సైన్యం, పౌరులు లక్ష్యంగా ఈ రసాయన ఆయుధాల్ని ప్రయోగించేందుకు ఇరాన్ తయారు చేసిందని చెప్పారు. దీనిపై ఆయన రాసిన ఆర్టికల్ చర్చనీయాంశమైంది. ఇరాన్ రసాయన ఆయుధాల తయారీని తక్కువ అంచనా వేయడానికి వీల్లేదని హెచ్చరించారు. రసాయన ఆయుధాల నుంచి వెలువడే పొగను ఒకసారి పీల్చిగానే, బాధితులు వెంటనే స్పృహ కోల్పోతారని, ఇజ్రాయెల్ సైనికులు, పౌరులను బందీలుగా చేసుకోవడానికి ఇరాన్ వాడొచ్చునని చెప్పారు.

హారిస్‌ను అధ్యక్షురాలిని చేయాలి

బైడెన్ వైదొలగాలని డిమాండ్లు

వాషింగ్టన్, నవంబర్ 11: అధ్యక్ష ఎన్నికల్లో కమలా హారిస్ ఓటమి డెమొక్రటిక్ నేతల్ని తీవ్రంగా నిరాశపర్చింది. ఎన్నికల్లో ఓడిపోయినా.. కమలా హారిస్‌ను ప్రెసిడెంట్‌ను చేయవచ్చునని డెమొక్రటిక్ నేత ఒకరు వ్యాఖ్యానించారు. ట్రంప్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించేవరకు కమలాహారిస్‌కు పదవి అప్పగించాలని ఆమె మాజీ కమ్యునికేషన్స్ వ్యవహారాల డైరెక్టర్ జమాల్ సిమన్స్ బైడెన్‌కు సూచించారు. 'జో బైడెన్ గొప్ప అధ్యక్షుడు. అయితే ఆయన చేసిన వాగ్దానం.. నెరవేర్చాల్సి ఉంది. తన పదవికి రాజీనామా చేసి, కమలా హారిస్‌కు బాధ్యతలు అప్పగించాలి. తద్వారా అమెరికాకు తొలి మహిళా అధ్యక్షురాలిగా కమలా హారిస్ నిలుస్తారు' అని అన్నారు. అమెరికా రాజ్యాంగం ప్రకారం, కొత్త అధ్యక్షుడిగా ట్రంప్ వచ్చే ఏడాది జనవరిలో బాధ్యతలు స్వీకరిస్తారు. దీనికి కొన్ని వారాల సమయముంది. అయితే బైడెన్ తన వాగ్దానాన్ని నెరవేర్చేందుకు మరో 30 రోజులు చాలని సిమన్స్ గుర్తుచేశారు.

ఉక్రెయిన్‌తో యుద్ధం తీవ్రం చేయొద్దు

- ఫోన్‌లో పుతిన్‌కు ట్రంప్ సూచన
- ఖండించిన క్రెమ్లిన్ వర్గాలు

వాషింగ్టన్: ఉక్రెయిన్‌తో చేస్తున్న యుద్ధం మరింత తీవ్రతరం చేసుకోవద్దని రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు డొనాల్డ్ ట్రంప్ సూచించారట! యూరప్‌లో అమెరికా సైనిక ఉనికి గణనీయంగా ఉందన్న సంగతి పుతిన్‌కు గుర్తుచేశారట. ట్రంప్-పుతిన్ మధ్య ఫోన్ సంభాషణలు జరిగినట్టు అంతర్జాతీయ మీడియాలో సోమవారం వార్తా కథనాలు వెలువడ్డాయి. ఉక్రెయిన్ యుద్ధం సహా పలు విషయాలు ఇరువురు మధ్య ప్రస్తావనకు వచ్చినట్టు వార్తా కథనాలు పేర్కొన్నాయి. ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు ఎలా పలకాలన్నది వారిద్దరు మాట్లాడుకున్నారని 'వాషింగ్టన్ పోస్ట్' తెలిపింది. కాగా, వీటిని క్రెమ్లిన్ (పుతిన్ అధికార కార్యాలయం) వర్గాలు ఖండించాయి.

'బాకూ'లో మొదలైన కాప్-29

బాకూ, నవంబర్ 11: 'పారిస్ ఒప్పంద' లక్ష్యాలు ప్రమాదంలో పడ్డాయని, మరోవైపు 2024 ఏడాదిలో ఉష్ణోగ్రతలు సరికొత్త రికార్డులను చేరుకోనున్నాయని ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది. ప్రపంచానికి పెను సవాల్‌గా మారిన వాతావరణ మార్పులను కట్టడి చేసేందుకు ఐక్యరాజ్యసమితి నిర్వహిస్తున్న 'కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్' (కాప్)-29 సదస్సు సోమవారం అజర్ బైజాన్ రాజధాని 'బాకూ'లో ప్రారంభమైంది. ఐరాస చీఫ్ గుటెరస్, ప్